www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 13 మే 2024 8 పేజీలు


వైఎస్ఆర్


అన్నమయ్య

నేడే పోలింగ్


కడప : ఇవిఎంలను తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

సర్వసన్నద్ధం!

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

ఓటు వేయనున్న 30.65 లక్షల మంది

3,104 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ఎన్నికల సిబ్బంది 22,357 మంది

బందోబస్తు విధుల్లో వేలాది మంది

పోలింగ్ కేంద్రాల వద్ద సహాయ కేంద్రాలు

నేరచరితులపై గట్టి నిఘా

సమయం ఆసన్నమైంది. ఎన్నికల్లో అంత్యంత కీలక ప్రక్రియ మరి కొన్ని గంటల్లో తెరలేవనుంది. కడప, అన్నమయ్య జిల్లాలోని రెండు లోక్‌సభ, 13 శాసనసభ స్థానాలకు సోమవారం జరగనున్న ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటర్లు తమ ఓటు ద్వారా తీర్పు ఇవ్వనున్నారు. ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా జడగడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. రెండు జిల్లాల్లో 30.65 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం 3,104 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల క్రతువుకు సంబంధించిన సమస్మాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. అందుకు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. 22,357 ఎన్నికల అధికారుల నియామకం, సామగ్రి తరలింపు, శాంతిభద్రతల పర్యవేక్షణపై దృష్టి సారించింది.

వార్త2లో

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

2లో

మొదటి సారిగా ఎన్నికలకు దూరంగా వైఎస్.విజయమ్మ

4,5లో

జలకళను కోల్పోయిన చెరువులు

7లో

పులివెందులకు చేరుకున్న ముఖ్యమంత్రి

- నేడు ఓటు వేయనున్న జగన్ దంపతులు

ప్రజాశక్తి పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్.భారతి ఆదివారం సాయంత్రం పులివెందులకు చేరుకున్నారు. సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు చేరుకుని అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో సిఎం జగన్ దంపతులు పులివెందులకు చేరుకున్నారు. రెండు నెలలుగా ప్రజల మధ్య ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం సాయంత్రం పిఠాపురం నియోజకవర్గంలోని ప్రచారంతో ముగింపు పలికారు. ఆదివారం తాడేపల్లి నుంచి తన సొంత నియోజకవర్గం పులివెందులకు వచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలింగ్ జరిగేందుకు ముందు



సొంత నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు కాకుండా వేరే ప్రాంతాలకు చెందిన వారు ఉండేందుకు అవకాశం ఉండదు. ఆయన ఆది, సోమవారం రెండ్రోజులపాటు పులివెందులలోనే ఉంటారు. ఆయనతోపాటు ఆయన భార్య వైఎస్ భారతి కూడా పులివెందులలోనే ఉంటారు..

2లో

గాలి, వానకు కుప్పకూలిన టెంట్లు

- ఎన్నికల సామగ్రి బస్సులలో ఉండడంతో ఊపిరి పిలుచుకున్న అధికారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందులలో గాలి వాన బీభత్సం సృష్టించడంతో తాత్కాలిక టెంట్లు కుప్పకూలి, కుర్చీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అప్పటికే ఎన్నికల సామగ్రిని బస్సులో చేర్చడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం జెఎన్‌టియు కళాశాలలో ఎన్నికల సామగ్రిని ఎన్నికల అధికారులకు పంపిణీ చేసినందుకు తాత్కాలిక టెంట్లను ఏర్పాటు చేశారు. వర్షం వచ్చే సూచనలు ఉండడంతో అధికారులు ముందుగా గ్రహించి సామగ్రిని బస్సుల్లో ఎక్కించారు. దీంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.


గాలివానకు కుప్పకూలిన టెంటు

నేడే పోలింగ్



ఇవిఎంలను సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల వ్యవహారం క్లైమాక్స్‌కు చేరుకుంది. జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం సోమవారం నాటి పోలింగ్ నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లూ చేసింది. కడప పార్లమెంట్ స్థానానికి 14 మంది, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 110 మంది అభ్యర్థులు, రాజంపేట పార్లమెంట్ స్థానానికి 18 మంది, ఆరు అసెంబ్లీ స్థానాలకు 70 మంది బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. వీరిని కడప జిల్లాలో 16,39,066 లక్షల ఓటర్లు, అన్నమయ్య జిల్లాలో 14,26,834 లక్షల మంది ఓటర్లు ఎన్నుకో నున్నారు. జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కడప జిల్లాలో 2,035, అన్నమయ్య జిల్లాలో 1,069 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కడప జిల్లాలో 14,640 మంది పోలింగ్ సిబ్బందిని, అన్నమయ్య జిల్లాలో 7,717 మంది పోలింగ్ సిబ్బందిని నియమించింది. అదనంగా 527 క్రిటికల్, 14 వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. 1,222 వెబ్‌కాస్టింగ్, 741 వీడియోగ్రఫీ, 610 మైక్రోఅబ్జర్వర్లు, 2,334 ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 2,336 ఎపిఎలు, 9360 ఓపిఓలను నియమించింది. అన్నమయ్య జిల్లాలోని 1,609 పోలింగ్ కేంద్రాలకు 1,926 మంది ప్రిసైడింగ్ ఆఫీ సర్స్, 1,929 మంది ఎపిఓలు, 7,717 మంది ఓపిఓలు, 482 మంది మైక్రోఅబ్జర్వర్లతోపాటు వేలాది మంది పోలీస్ సిబ్బందితో ఎన్నికలను పర్యవేక్షిస్తోంది. జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం వృద్ధులకు, వికలాంగులకు పోలింగ్‌కేంద్రాల దగ్గర రెయిలింగ్ సదుపాయాలను ఏర్పాటు చేసింది. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించనుంది. ఆదివారం మాక్ పోలింగ్‌ను సైతం నిర్వహించింది. అనంతరం సోమవారం పూర్తి స్థాయి పోలింగ్ నిర్వహణకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని అందించింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రంలోపు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ వాహనాల్లో ఎన్నికల సిబ్బంది చేరు కోవాలని ఆదేశించింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం ఏడు గంటల సమయానికి పోలింగ్ సామగ్రిని అమర్చుకుని పోలింగ్ నిర్వహణకు సిద్ధంగా ఉండాల్సి ఉంది. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సంబం ధించి ఈనెల 11 నుంచి జూన్ 11 వరకు 144 సెక్షన్ అమలు ఉండడంతోపాటు కడప జిల్లాలో మూడు వేల మంది సాధారణ పోలీస్ బందోబస్తుతోపాటు కర్నాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల నుంచి హోంగార్డులు, కేంద్రబలగాలతో కలిసి ఐదు వేల మంది పోలీసులు, అన్నమయ్య జిల్లాలో 144 సెక్షన్ అమలుతో పాటు 11 కంపెనీల సిఆర్‌పిఎఫ్, ఒక కంపెనీ ఎపిఎస్పీ బలగాలతోపాటు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అదనపు బలగాలను మోహరించింది.


ఎన్నికల విధులకు సిద్ధంగా ఉన్న సిబ్బంది


ఎన్నికల సిబ్బంది కోసం సిద్ధంగా ఉన్న బస్సులు


ఎన్నికల విధులకు హాజరవుతున్న స్పెషల్ పోలీసులు

పులివెందులకు చేరుకున్న..

(మొదటిపేజీ తరువాయి) రాత్రి పులివెందులలోనే ముఖ్యమంత్రి బస చేశారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పార్టీ నాయకులు, పోలీసులు ఏర్పాటు చేశారు. ఓవైపు పోలింగ్.. మరోవైపు సిఎం వస్తుండటంతో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భాకరాపురంలోని జయమ్మ కాలనీలో అంగన్వాడీ కేంద్రం రెండో సెంటర్లో 138 బూత్ నెంబర్‌లో తమ ఓటు హక్కును వినియోగి ంచుకోనున్నారు. జగన్మోహన్‌రెడ్డి, భారతి, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అదే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ

ప్రజాశక్తి కడప అర్బన్

శ్రీ శ్రీ రవిశంకర్ గురూజీ పుట్టిన రోజు సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ కడప వారి ఆర్థిక సౌజన్యంతో మజ్జిగ కూల్ మినరల్ వాటర్ పంపిణీ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హరినాథ్ రెడ్డి, ధ్రువ శేషారెడ్డి రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మానవతా డైరెక్టర్స్ రాటాల గోపి, డాక్టర్ అవటాల రామాంజుల రెడ్డి, పి.సుబ్బరాయుడు, ప్రొఫెసర్ జి. సాంబశివారెడ్డి, బిందు, సమ్మెట సత్యనారాయణ, వెంకట్రామిరెడ్డి, నారాయణ, వినోద్ హాజరయ్యారు. 5వేల మందికి పైగా మజ్జిగ, కూల్ మినరల్ వాటర్ ను అందజేశారు. వేసవి తగ్గేంతవరకు నిర్విరామంగా కొనసాగిస్తామని తెలిపారు. అవకాశాన్ని కడప పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి తమ సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఎన్నికలు జరుగుతున్నందువల్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి
ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్

ప్రజాశక్తి కడప అర్బన్

కడప నియోజకవర్గ పరిధిలో సోమవారం నిర్వహించే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో ఎన్నికల విధులకు హాజరయ్యే పిఒలు సిబ్బందికి ఇవిఎంలను ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించామని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి సహాయకులుగా ఉండేందుకు ముగ్గురిని నియమించామని పేర్కొన్నారు. కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రిని సజావుగా పోలింగ్ కేంద్రాలను తీసుకువెళ్లి, ఎన్నికల పూర్తయిన వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించాలని చెప్పారు. ఎన్నికల టీం మీకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. నగరంలో ఎన్నికల కేంద్రానికి చేరుకునేందుకు కేవలం 30 నిమిషాలు మాత్రమే పడుతుందని పేర్కొన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా స్పందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇవిఎంలను పోలింగ్ స్టేషన్లకు తీసుకువెళ్లి ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత సజావుగా అధికారులకు అప్పగించాలని చెప్పారు. 1222 కేంద్రాలలో వెబ్ కాస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. బ్యాలెట్ బుల్లెట్ కంటే శక్తివంతమైంది అన్న విషయాన్ని పోలింగ్ సిబ్బంది గ్రహించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని కోరారు. ఎవరికి అనుకూలంగా పోవాల్సిన అవసరం లేదని రూల్ ప్రకారం పనిచేయాలని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మధుసూదన్

36 పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు

ప్రజాశక్తి-చెన్నూరు

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పార్లమెంటు, శాసనసభకు జరుగుతున్న ఎన్నికలకు గాను చెన్నూరు మండల వ్యాప్తంగా 36 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రం మూడు గంటలకే పోలింగ్ నిర్వహించే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకునేందుకు సిబ్బంది తలమునకలయ్యారు. తహశీల్దార్ ఎస్.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద చలువ పందిళ్లు, తాగునీరును సిద్ధం చేశామన్నారు. పురుషులు, మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వేర్వేరు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బందిని నియమించామన్నారు. సిఐ పార్థసారథి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కేంద్రంలోనూ పోలీసు బందోబస్తును నియమించామని తెలిపారు.

మదర్స్ డే పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి కడప అర్బన్

చిన్ననాటి నుంచి తమ బిడ్డలను అల్లారు ముద్దుగా పెంచే అమ్మ సేవలను వెలకట్టలేమని ప్రముఖ వైద్యులు డాక్టర్ వార ణాసి ప్రతాప్ అన్నారు. ఆదివారం ఆర్కే రాయల్ కరీం ఆధ్వర్యంలో తయారు చేసిన మదర్స్ డే పోస్టర్లను తన క్లినిక్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మను మించిన దైవం లేదన్నారు. అమ్మకు సేవ చేయడం ప్రతి ఒక్కరి ధర్మం అన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ వారణాసి ప్రతాపరెడ్డి

లక్కుంటే.. కాసులు తప్పితే బతుకు బస్టాండ్..

మహమ్మారి మట్కా మాయలో పడుతున్న పేద కుటుంబాలు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

లక్కు ఉంటే కాసులు లేకపోతే బతుకు బస్టాండ్, మట్కా మాయలో పడుతున్న పేద కుటుంబాలు, సహజంగా సమాజంలో ప్రతి ఒక్క సామాన్యుడికి లక్షాధికారి కావాలనే లక్ష్యం ఉంటుంది. కొందరు కొన్ని కొన్ని మారాలను ఎంచుకుని సంపదే ధ్యేయంగా పనులు చేసుకుంటారు. కొందరు అతి తక్కువ సమయంలోనే కోటీశ్వరులు కావాలనే ఉద్దేశ్యంతో తప్పుడు మార్గాలను నేర్చుకుని మోసపోయి అప్పుల బారిన పడుతుంటారు. మట్కా వల్ల లక్కుంటే..లక్షాధికారి కావచ్చని కొందరు తప్పుడు నిర్ణయాలు తీసుకుని మహమ్మారి మాయదారి మట్కా వలలో పడి మోసపోతు అప్పుల బారిన పడుతున్నారు. కొందరు లక్కు ఉండి లక్షాధికారులయ్యారు. లక్కు తప్పిన వారి పరిస్థితి బతుకు బస్టాండ్‌గా మారింది. ఈ మట్కా పట్టణం, గ్రామాలు తేడా లేకుండ మట్కాబీటర్లు మట్కా రాస్తూ సామాన్య ప్రజలను మోసం చేస్తూ బీట్టర్లు జేబులు నింపుకుంటున్నారు. అయితే పోలీసు లు ఎన్నికల విధులు ఉండడంతో మట్కా రాయుళ్ళ తమ పని తాము యదేశ్చగా చేసుకుంటున్నారు కొన్ని మట్కా స్థావరాల పై దాడులు నిర్వహించి మట్కా బీటర్లపై కేసులు నమోదు చేసినా నేటికి కూడా మారనివైనం. గతంలో ఉన్న అధికారులు గ్రామ మరియు జిల్లా బహిష్కరణలు చేసిన కూడా మారని బీటర్ల తీరు. ముఖ్యంగా తోపుడు బండ్లు వ్యాపారులు, చిన్నచిన్న వ్యాపారులు, కూలీలు, వృత్తుల వారు అధికంగా మట్కా ప్రభావితం అవుతున్నారు. పొద్దున్నుంచి సాయంత్రం వరకు కష్టపడిన డబ్బులు తగలేసి అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. అప్పుడు దొరకక పట్టణాన్ని సంఘటన కూడా ఉన్నాయి. మట్కా నిర్వాహక పోలీసులు దాడి చేయడంతో స్థావరాలను మూసివేసి తమ దూతలను మట్కా రాసే వారి దగ్గరికి పంపుతూ వ్యవహారాన్ని నడుపుతున్నారు. అంతేకాకుండా కూల్ డ్రింక్స్ , టీ దుకాణంలో కూర్చుని రాస్తున్న వైనం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. వీరు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా జరుగుతుంది. లక్కుంటే మేము లక్షాధికారులు అవుతామేమో అని మహమ్మారి మట్కాకు డబ్బులు వేసి , జేబులకు చిల్లులు వేసుకుని ఇళ్లకు పోవాల్సిన దుస్థితి నెలకొంది. మట్కా పై పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టాలి మట్కా మహమ్మారిని రూపు మాపాలంటే పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టడానికి నిజాయితీ గల పోలీసులతో ప్రత్యేక టీములను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే మట్కా నిర్వాహకులకు, బీటర్లకు, ఆడేవారికి కౌన్సిలింగ్ లు నిర్వహించి మట్కా వల్ల జరిగే నష్టాలను తెలియజేయాలి. ఈ దిశగా పోలీసు నిఘా ఏర్పాటు చేసి మట్కా నిర్వాహకులపై, బీటల్లపై కఠిన చర్యలు తీసుకొని మట్కా మహమ్మారి నుంచి వారి నుంచి పేదలను రక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. నాయకులు అండదండలతో మట్కా స్థావరాలు అధికార పార్టీకి చెందిన నాయకుల ఆందోళనలతో మట్కా బీటలు పుట్టగొడుగుల్లా వెలిశారు. పట్టణంలో పక్కా రాయడానికి ఎక్కువగా చిన్నచిన్న దుకాణాలలో మహిళలను ఉపయోగించుకుని ఈ స్థావరాలను నడుపుతున్నారు. మహిళలైతే ఎవరికి ఎటువంటి అనుమానం రాదని వివా హకుల ఉద్దేశం. స్థావరాలపై పోలీసులు దాడి జరిగిన వెంటనే నాయకులు సిఫారసులు చేయడంతో చేసేదేమీ లేక పోలీసులు వారిని వదిలిపెట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా సామాన్య కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండాలంటే అటు అధికారులు, నాయకులు చిత్తశుద్ధితో మక్కా మహామారుని రూపు మాపితే ఎన్నో కుటుంబాలు బాగుప డతాయని చర్చించుకుంటున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూడాలి : జెసి



పీలేరు: ఎన్నికల విధుల కేటాయింపులో పాల్గొన్న ఆర్ఒ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-పీలేరు

ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలు కల్పిస్తూ ఇవిఎంలను ఏర్పాటు చేసుకోవాలని 163 పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఆర్ఒ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ తెలిపారు. పీలేరు పట్టణ శివారులోని మదనపల్లి మార్గంలో ఉన్న సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి, ఇవిఎంల పంపిణీ కేంద్రానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఒ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఇవిఎంలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఇతర సామగ్రి కిట్లను స్వీకరించి, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ముందుగా చేరుకోవాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 281 పోలింగ్ కేంద్రాల్లో విధులకు హాజరయ్యే పిఒ, ఎపిఒ, ఒపిఒలకు గుర్తింపు కార్డులు, ఎన్నికల సామగ్రి కిట్లతో పాటు ఇవిఎంలు పంపిణీ చేశారు. అనంతరం ఎన్నికల సిబ్బందిని సెక్టార్ల వారీగా ఏర్పాటు చేసిన 78 బస్సుల్లో వారికి కేటాయించిన రూట్లలోని పోలింగ్ కేంద్రాలకు చేరవేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో పీలేరు ఇఆర్ఒ రమ, ఎఆర్ఒ మహబూబ్‌బాషా, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లి :** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని మదనపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ మొత్తం ఓటర్లు 2, 68,580 మంది ఉండగాపురుషులు, 130461, స్త్రీలు 138068, ట్రాన్స్ జెండర్స్ 51మంది ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 260 పోలింగ్ కేంద్రాలు ఉండగా 520 ఇవిఎంలను పంపిణీ చేశారని చెప్పారు. నియోజకవర్గం రామసముద్రం, నిమ్మనపల్లి, మదనపల్లి మండలాలకు గాను మొత్తం రూట్స్ 38, పిఒ పోలింగ్ ఆఫీసర్లు 312 మంది, ఏ పి ఓ ఫస్ట్ పోలింగ్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్ 54 మెంబర్స్, వీడియో గ్రాఫర్స్ 19 మంది, వెబ్ కాస్టింగ్ 161,మంది పాల్గొంటున్నారని తెలిపారు.జడ్‌పి హైస్కూల్‌లో 260 పోలింగ్ స్టేషనులకు ఇవిఎంలను, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశామన్నారు. 4 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఎస్‌పి కృష్ణారావు పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పోలీసులు, బిఎస్ఎఫ్, శిక్షణ ఎస్‌పిలు, స్థానిక పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారని తెలిపారు. **రైల్వేకోడూరు :** ఠైల్వేకోడూరు 127 ఎస్‌సి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి తెలిపారు. 2,01,544 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదివారం రైల్వే కోడూరు మండలంలోని ఉద్యాన కళాశాల ఆవరణంలో ఎన్నికల సిబ్బందికి ఇవిఎం బాక్సులను అందించారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాలలో 252 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి 68 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 31 మంది సెక్టార్ ఆఫీసర్లు, 69 సమస్యాత్మక గ్రామాల్లో మైక్రో అబ్జర్వ్ వీడియో గ్రాఫర్లు ఉంటారన్నారు. ఒక్క నార్మల్ పోలింగ్ స్టేషన్‌లో ఒక్క పోలీసు, సమస్యాత్మక పోలింగ్ బూతులు వద్ద ఐదుగురు పోలీసులు ఉంటారన్నారు. అభ్యర్థులు వాహనాలను పోలింగ్ కేంద్రం వద్ద నుంచి 200 మీటర్ల దూరంలో ఉండాలని తెలిపారు. ఇవిఎంలు సాంకేతిక పరంగా మొరాయిస్తే మరో ఇవిఎం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఓటర్లు వారికి ఇచ్చిన స్లిప్పులతో పాటు ఫోటో గుర్తింపు ఉన్న ఏదైనా కార్డును తీసుకుని వచ్చి ఓటు వేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. 170 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల అధికారి కేంద్రంలో టివిలో 170 కేంద్రాలలో కెమెరాలు ఏర్పాటు చేశామని ఏమి జరుగుతుందో తెలిసిపోతుందని వివరించారు. ప్రశాంత పోలింగ్ కు ప్రజలు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. **వీరబల్లి :** ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు మండల యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. మండలంలో 30 పోలింగ్ బూతులు ఉన్నాయి. 204 మంది పోలింగ్ అధికారులు ఉంటారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. ఆదివారం ఉదయమే పిఒలు, ఎపిఒలు ఇతర సిబ్బంది చేరుకున్నారు. **కలకడ:** ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి ప్రియదర్శిని తెలిపారు. ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘంలో చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్లను సెక్రటే రియల్ అధికారి రామచంద్రారెడ్డి, సెక్రటేరియల్ పోలీస్ అధికారి కంబెల్ల రమేష్‌కుమార్‌లు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైనులు ఏర్పాటు చేయడం, నీటి సౌకర్యం విద్యుత్ దీపాలు, వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లకు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు నీడను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.**పెద్దమండ్యం :** మండలంలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల సామగ్రి ఇవిఎంలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. మండలంలో 17 పంచాయతీల్లో 31 పోలింగ్ కేంద్రాలుఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. 31 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలో 28210 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.



మదనపల్లి: పోలింగ్ వివరాలను తెలుపుతున్న ఆర్ఒ



ఎన్నికల విధులకు పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది



వీరబలి : ఎన్నికల నిర్వహణకు సిద్ధమైన పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు

- జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం 163 పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన కనీస సౌకర్యాలను సమకూర్చడం జరిగిందని పీలేరు ఆర్ఒ, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఆదివారం ఆయన ఓటర్ల వివరాలతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల సిబ్బంది వివరాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మౌలిక సౌకర్యాల గురించి వివరించారు. పీలేరు నియోజకవర్గం పరిధిలోని గుర్రంకొండ మండలంలో 43, కలకడ మండలంలో 31, కెవి పల్లి మండలంలో 38, వాల్మీకిపురం మండలంలో 49, కలికిరి మండలంలో 48, పీలేరు మండలంలో 72 వంతున మొత్తం 281 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వీటి ద్వారా నియోజకవర్గంలో 1,14,962 మంది పురుషులు, 1,19,624 మంది మహిళలు, 22 మంది హిజ్రాలు (తార్డ్ జెండర్లు) మొత్తం 2,34,608 మంది ఓటర్లు సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి వీలుగా తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. 338 మంది ప్రిసైడింగ్ అధికారులు, 338 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మొత్తం 1352 మంది ఇతర అధికారులు విధులు నిర్వహించనున్నారని చెప్పారు. పీలేరు సెన్సిటివ్ నియో జకవర్గంగా గుర్తించబడటంతో 281 పోలింగ్ కేంద్రా ల్లోనూ వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో 26 వీడియో కెమెరాలను కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సౌకర్యంగా షామియానాలు, బారికేట్లు, తాగునీరు, ఓటరు సహాయ కేంద్రాలు, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఒ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

అభివృద్ధి కోసం ఒక్క అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గ అభివృద్ధి కోసం తనకు ఒక్కసారి అవకాశ ఇవ్వాలని జమ్మలమడుగు స్వతంత్ర్య అభ్యర్థి అల్లె ప్రభావతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అల్లె ప్రభావతి గోడౌన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2004 నుంచి 2019 వరకు ఆదినారాయణరెడ్డి, 2019 నుంచి 2024 వరకు సుధీర్ రెడ్డి ఇద్దరూ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి తప్ప జమ్మలమడుగులో 2009 నుంచి ఇప్పటివరకు జమ్మలమడుగు నియోజకవర్గం అన్ని రంగాలలో వెనుకబడి ఉందన్నారు. దోచుకొని దాచుకొనే నాయకులను తరిమికొట్టాల్సిన ఆవశ్యకత నేడు వచ్చిందన్నారు. నియోజకవర్గం ఓటర్లకు ఒకటే విన్నపం చేస్తున్నాను. నిష్పక్షపాతంగా పరిపాలన సాగించేందుకు తాను సిద్ధంగా ఉన్నాను. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి మీ సమస్యకు పరిష్కారం చూపిస్తానని తెలిపారు. నేడు గాజుల గుర్తుపై ఓటేసి అల్లె ప్రభావతిని గెలిపిస్తే నియోజకవర్గంకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు.

ఇవిఎం పుట్టిందిలా..



నేతల భవిష్యత్‌ను తేల్చే బ్యాలెట్ విధానం పోయింది. ఈ విధానం ద్వారా సమయం ఎక్కువగా తీసుకుంటుండంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈవీఎంలను ప్రవేశపెట్టింది. తొలిసారిగా 1982 మే 18న కేరళ రాష్ట్రం పరుర్ అసెంబ్లీ నియోజ కవర్గంలో దీన్ని వినియోగించారు అనంతరం 1982-83 లో దేశవ్యాప్తంగా నిర్వహించిన పది ఉప ఎన్నికల్లో వీటిని వినియో గించారు. కానీ వీటి పనితీరుపై వివిధ రాజకీయ పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో 1984 మే 5న ఈవీఎంల వినియోగాన్ని రద్దు చేశారు ఈ దీంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి 1988 డిసెంబర్‌లో కేంద్రం సెక్షన్ 61ఎ ద్వారా ప్రజా ప్రాతినిధ్య చట్టంతో ఈవీఎంల వాడకాన్ని చేర్చింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 61 ఏ సవరణ 1989 మార్చి 15 న అమల్లోకి వచ్చింది. 1990 జనవరి ఎన్నికల సంస్కరణల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే ఏడాది ఏప్రిల్లో ఇవిఎంల వాడకాన్ని సాంకేతిక నిపుణుల కమిటీ సమర్థించింది 1999, 2004 సంవత్సరాలలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు.

లోక్‌సభకు 2004-14 మధ్య జరిగిన ఎన్నికల్లో వీటిని వాడారు. 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీ ప్యాట్(ఓటరు వెరీ ఫై య బుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ను అనుసంధానం చేయాలని నిర్ణయించారు. నాగాలాండ్ రాష్ట్రంలోని నాక్ సింగ్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2013 సెప్టెంబర్ 4న వివి ప్యాట్‌లను మొదటిసారిగా వినియోగించారు. 13 అక్టోబర్ 8న దశల వారిగా వివిఫ్యాట్లలను వినియోగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్‌లో 3,173.47 కోట్లతో 16.15 లక్షల వి.వి ప్యాట్లను కొనుగోలుకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లోనూ వివిప్యాట్లను వినియోగించారు.

ఓటు హక్కు పుట్టిందిలా..

సమాజంలో ప్రతి పౌరుడికీ ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది. ఎన్నికల్లో తమకు నచ్చిన అవినీతి రహిత పాలన అందించే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునే హక్కు ఈ ఓటు హక్కు ద్వారానే సాధ్యపడుతుంది. ప్రస్తుత ఎన్నికల సమయంలో ప్రతి పౌరుడికీ ఓటు ఎంతో కీలకం ఎక్కడైనా ఈనోటా విన్న అంతటా రాజకీయాల గురించే చర్చ. ఈ సందర్భంలో ఓటు గురించి అందరూ మాట్లాడుకుంటున్న ఓటు హక్కు పుట్టు పూర్వోత్తరాలు తెలిసింది అతి తక్కువ మందికి. దీని గురించి తెలుసుకుందాం.

ఆంగ్లేయుల కాలంలో మొదలైన ఎన్నికల ప్రక్రియ 1938 నాటికి ఓ రూపానికి వచ్చింది. ఓటు అసలు కథ పరిశీలిస్తే బ్రిటిష్ పాలనలో పరిమిత ప్రాతిపదికన భారతీయులకు కల్పించిన ఓటు హక్కును భారత రాజ్యాంగం పౌరులందరికీ సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించింది. 1907లో ఏర్పడిన రాయల్ కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓటు హక్కుపై చేసిన సిఫార్సుల ఆధారంగా 1909 కౌన్సిల్ చట్టం పరిమిత ప్రాతిపదికన భారతీయులకు ఓటు హక్కు కల్పించారు. 1919 కౌన్సిల్ చట్టం ఈ హక్కును కొంతమేర విస్త త పరిచింది 1935 భారత ప్రభుత్వం చట్టం ద్వారా ఈ హక్కును 10.6 శాతానికి పెంచారు.

రాజ్యాంగ పరిషత్ ఎన్నికల సందర్భంగా 28.5 శాతం ప్రజలకు దీన్ని విస్తరింపజేశారు స్వాతంత్రం అనంతరం భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి ఉండడంతో రాజ్యాంగం భారత పౌరులకు సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించింది ప్రజాస్వామ్యంలో సూత్రాన్ని అనుసరించి 325 అధికరణ ప్రకారం ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే కల్పన, కుల, మత, వర్గ, వర్ణ, జాతి, ప్రాంతం, లింగ భేదాలు వంటి తేడాలు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వ్యక్తికి ఓటు హక్కు ఉండాలని తెలియజేశారు.

326 వ అధికరణ కింద సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించింది 1988లో 61 వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఓటు హక్కు పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది. అత్యంత ప్రాధాన్యం కలిగిన హక్కుగా ప్రాముఖ్యతను చేర్చుకుంది.

ఆదర్శ పోలింగ్ కేంద్రంగా లక్ష్మీపేట

ప్రజాశక్తి-చాపాడు

చాపాడు మండలంలోని లక్ష్మీపేట పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేశారు. గ్రామంలో అధికంగా విద్యావంతులు ఉండడం, గత ఎన్నికలలో సమస్యలు జరగకపోవడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామ విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి పోలింగ్ కేంద్రం వద్ద బోర్డును ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు నమూనా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎంపికైన లక్ష్మీపేట కేంద్రం



ఎన్నికల విధులకు సిబ్బంది సిద్ధం

పోలింగ్ కేంద్రానికి చేరిన వైనం

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం ఓటర్లు తమ ఓటు హక్కుతో ఐదేళ్లు పాలించే నాయకులను ఎన్నుకోకున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఎన్నిక విధులకు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలకు చేరుకున్నారు. ఆదివారం ఎన్నికల సామగ్రిని తీసుకుని ఆర్టీసీ కేటాయించిన బస్సులలో విధులకు హాజరయ్యారు. పోలీసులూ ఇదే రీతిలో ఎన్నికల విధుల్లో చేరారు.



రాయచోటిలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్ర ఎన్నికలకు సోమవారం పోలింగ్ ఏర్పాట్లను అధికార యంత్రాంగం సిదద్ధం చేసింది. అన్నమయ్య జిల్లాలో 14,26,834 మంది ఓటర్లు, 1609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాయచోటి నియోజకవర్గం మొత్తం ఓటర్ల సంఖ్య 2,55,168 ఉన్నారు. పురుషులు 1,26,090, మహిళలు 1,29,051, ట్రాన్స్ జెండర్స్ 27 మంది ఉన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో మొత్తం 204466 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 100663, మహిళలు103794, ట్రాన్స్ జెండర్స్ 9 మంది ఓటర్లు ఉన్నారు. రాజంపేట నియోజకవర్గంలో 241200 ఓటర్లు ఉన్నారు. పురుషులు 117577, స్త్రీలు 12 3617, ట్రాన్స్ జెండర్స్ 6 మంది ఓటర్లు ఉన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 224802 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 110627, స్త్రీలు 114163, ట్రాన్స్ జెండర్స్ 12 మంది ఓటర్లు ఉన్నారు. పీలేరు నియోజకవర్గంలో మొత్తం 234608 మంది ఓటర్లు ఉన్నారు పురుషులు 114962, స్త్రీలు 119624, ట్రాన్స్ జెండర్స్ 22 మంది ఓటర్లు ఉన్నారు. మదనపల్లి నియోజకవర్గంలో 266590 మంది ఓటర్లు ఉన్నారు ఇందులో పురుషులు 130461, స్త్రీలు 136077, ట్రాన్స్ జెండర్స్ 51 మంది ఓటర్లు ఉన్నారు. రాజంపేట నియోజకవర్గంలో 288, రైల్వే కోడూర్ 252, రాయచోటి 292, తంబళ్లపల్లె 236, పీలేరు 281, మదనపల్లి 260, మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాయచోటి నియోజకవర్గం లో సార్వత్రిక ఎన్నికలు ఏర్పాట్లు అన్ని పూర్తి చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి తెలిపారు. ఆదివారం పట్టణంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి ఇవిఎం బాక్సను అందజేశారు. రాయచోటి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం సంబే పల్లె, చిన్నమండెం మండలాలలో 292 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అవాంఛనీయ సంఘటనకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కృష్ణారావు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా ఆ సాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏర్పాట్లన్ని పూర్తి : అన్నమయ్య జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో 1609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎంఅభిషిక్త్ కిషోర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

చాపాడు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పిఒ, ఎపిఒ, ఇతర సిబ్బందికి అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. మైదుకూరు నియోజకవర్గానికి సంబంధించి చాపాడు మండల పరిధిలోని సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంప్ ఏర్పాటు చేశారు మైదుకూరు నియోజకవర్గం ఎన్నికల అధికారి చంద్రమోహన్ ఆధ్వర్యంలో సామాగ్రి పంపిణీ చర్యలు చేపట్టారు. ఉదయం 6 నుంచే సిబ్బంది సిబిఐటి ఇంజజినీరింగ్ కళాశాలకు చేరుకున్నారు. ఇవిఎంలు, వివి ప్యాడ్స్ ఇతర సామగ్రిని సిబ్బందికి అందించారు. తీసుకున్న సామగ్రిని పోలింగ్ సిబ్బంది తనిఖీ చేసుకుంటున్నారు. హెల్ప్ డెస్క్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. డిఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు జరుగుతున్నాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీస్ సిబ్బంది ముందస్తుగా తనిఖీ చేస్తున్నారు.మైదుకూరు నియోజకవర్గం లో మొత్తం 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మైదుకూరు మండలంలో 79 పోలింగ్ కేంద్రాలు, దువ్వూరు మండలంలో 55 పోలింగ్ కేంద్రాలు, చాపాడు మండలంలో 39 పోలింగ్ కేంద్రాలు, బ్రహ్మంగారిమఠం మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు, ఖాజీపేట మండలంలో 54 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. మైదుకూరు నియోజకవర్గంలో 29 సమస్యత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. నక్కలదిన్నె పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ తనిఖీ చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన మైదుకూరు డిఎస్‌పి వెంకటేశులు, అధికారులు. సిబ్బందికి భోజన వసతిని కల్పించారు. వేడి తీవ్రతకు మహిళలు సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఎన్నికల విధులకు చంటి బిడ్డలతో హాజరయ్యారు.



చాపాడు : చంటి బిడ్డలతో ఎన్నికల విధులకు హాజరైన మహిళా ఉద్యోగులు



రాజంపేట : ఇవిఎంల కోసం నిరీక్షస్తున్న సిబ్బంది



పులివెందుల : ఎన్నికల విధులకు హాజరవుతున్న సిబ్బంది

పులివెందుల టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ ఎప్పుడు ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికల సమరం ఆరంభమైంది. సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రానికే ఆయా పోలింగ్ బూతులకు ఎన్నికల సామాగ్రి చేరింది. పులివెందుల నియోజ కవర్గానికి సంబంధించి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల పిఒ, ఏపీఓ, ఇతర సిబ్బందికి అవసరమైన సామాగ్రిని ఎన్నికల అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో సామాగ్రి ని పంపిణీ చేశారు. ఎన్నికల అధికారులు పోలింగ్ బూతుల వద్ద ఓటర్ల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. డిఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గం లోని అన్ని బూతుల వద్ద ప్రత్యేక పోలీస్ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు . ఏదైనా బూతు వద్ద ఆందోళనలు కానీ ఘర్షణలు జరిగినప్పుడు వెంటనే పోలీసులు స్పందించే విధంగా ప్రత్యేక అధికారులను కూడా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీస్ సిబ్బంది ముందస్తుగా తనిఖీ చేస్తున్నారు.

పీలేరు: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలు కల్పిస్తూ ఇవిఎంలను ఏర్పాటు చేసుకోవాలని 163 పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఆర్ఒ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్అహ్మద్ ఖాన్ తెలిపారు. పీలేరు పట్టణ శివారులోని మదనపల్లి మార్గంలో ఉన్న సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి, ఇవిఎంల పంపిణీ కేంద్రానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఒ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఇవిఎంలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఇతర సామగ్రి కిట్లను స్వీకరించి, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ముందుగా చేరు కోవాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 281 పోలింగ్ కేంద్రాల్లో విధులకు హాజరయ్యే పిఒ, ఎపిఒ, ఒపిఒలకు గుర్తింపు కార్డులు, ఎన్నికల సామగ్రి కిట్లతో పాటు ఇవిఎంలు పంపిణీ చేశారు. అనంతరం ఎన్నికల సిబ్బందిని సెక్టార్ల వారీగా ఏర్పాటు చేసిన 78 బస్సుల్లో వారికి కేటాయించిన రూట్లలోని పోలింగ్ కేంద్రాలకు చేరవేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు.



చాపాడు : ఇవిఎంలను తీసుకెళుతున్న ఎన్నికల సిబ్బంది



పీలేరు : ఎన్నికల విధులకు హాజరవుతున్న పోలీసులకు సూచనలిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్‌పి కృష్ణారావు



పీలేరు : పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

మొదటి సారి ఓటుకు దూరంగా వైఎస్.విజయమ్మ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్



దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సతీమణి, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తల్లి వైఎస్.విజయమ్మ మొదటిసారి వినియోగించుకోలేక పోతున్నారు. కుటుంబ రాజకీయాలతో మనస్థాపం చెంది అమెరికాకు వెళ్లిపోయిన విషయం తెలిసిందే. సోమవారం ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో విజయమ్మ అక్కడే ఉండడంతో ఓటు నియోగించుకోవడానికి రావనట్లు తెలుస్తుంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి హోదాలో ఎన్నికల్లో తలపడుతున్న సమయంలో వైసిపికి వ్యతిరేకంగా కడప పార్లమెంట్ బరిలో వైఎస్.షర్మిల ఉన్నారు. ఈ సమయంలో కేవలం కుమార్తెకు మాత్రం మద్దతు ప్రకటించారు. విజయమ్మ ఓటు వేయడానికి రాకపోవడంతో రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారింది.



షర్మిల ఓటు వేయనున్న పోలింగ్ బూత్

ఇడుపులపాయలో ఓటు వేయనున్న షర్మిల

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఇడుపుల పాయలోని పోలింగ్ బూత్‌లో ఉదయం 9 గంట లకు పిసిసి ఛీఫ్, కడప కాంగ్రెసు ఎంపీ అభ్యర్థి షర్మిల ఓటు వేయనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం మొత్తం ఆసక్తిగా ఎదు రుచూస్తున్న పార్లమెంటు స్థానం కడప. కడప గడ్డపై వైఎస్ కుటుంబం ఇంతవరకు ఓటమి ఎరుగలేదు. కడప గడ్డపై వైఎస్ కుటుంబం నుంచి అన్న, చెల్లెలైన సిఎం జగన్, పిసిసి చీఫ్ షర్మిల పోటీ పడుతున్నారు. చెల్లి కాంగ్రెస్ పార్టీ తరపున కడప పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తుండగా వరుసకు తమ్ముడైన వైఎస్ అవినాష్‌రెడ్డి వైసిపి తరపునుంచి పోటీ చేస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ తరపున షర్మిల ఇడుపులపాయ పంచాయతీలోని మల్లెలమ్మపల్లె, ట్రిపుల్‌ఐటి ఆర్కేవ్యాలీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బూతు నెంబర్ 261లో ఆమె ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వైఎస్ షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్, ఓటు వేయనున్నారు. 261వ బూతులో షర్మిల కుటుంబ సభ్యులు ఓటు హక్కును కలిగి ఉన్నారు. వైసిపికి చెందిన కాంగ్రెస్ పార్టీ తరపున చక్రాయపేట మండల వైసిపి ఇన్‌ఛార్జ్ వైఎస్ కొండారెడ్డి, ఆయన సతీమణి ధనలక్ష్మి, కొడుకు వైఎస్ రాహుల్‌రెడ్డి, కూతురు వైఎస్.స్నేహారెడ్డి అక్కడే ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇక షర్మిలపై పోటీ చేస్తున్న వైఎస్ అవి నాష్‌రెడ్డి పులివెందల పట్టణంలోని బాకరా పురంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన బూతు నెంబర్ 138లో ఓటును వేయనున్నారు. మల్లెలమ్మపల్లెలో 103 ఓట్లు ఉండగా వాటిలో పురుషులు 54, మహిళలు 49 ఉన్నారు.

ఓటరన్నా..!



ఓటరన్నా ! దారెటన్నా ! ఓట్ల కాలం వచ్చెనన్నా !
ఒక్క నిముషం బద్దకించిన ఉన్న పాట్లె నిన్నుముంచు
జనం కోసం , జలం కోసం, బలం కూర్చి, గళం విప్పి
పాటుపడి నీవెంట నడిచే వాడె నేత, విధాత వాడె
బడుగు వర్గం పాటు లెరిగి, లోటు పాటుల గురుతు లెరిగి,
భిక్షు కత్తెల పాటు లెరిగి, భిక్షుకత్వం రూపుమాపి,
వెనుకబాటు తనం బాపి, ముందు నడిచే దారి చూపెడి
వరములిచ్చే నేతకావలె, వారె జాతికి ప్రాణదాతలు

మేనువంచి, చెమటదీసి, చేను తడిపే, రైతు నేస్తం,
అప్పజేసి, పంట నూడ్చి, జాతి ఆకలి దీర్చు రైతు,
అప్ప తీరక పాలం మందులె శరణమాయె తనకు రక్షగ
అమ్మవంటి రైతు నాడెడి, ఆర్తికావలె బతుకు పండుగ
భూమిపైన పుట్టెనంక బతుకు సల్లంగుండ తలతురు
పాడుగుసేతుల వడ్డనలతో పేదకైనను బుగితి గడవదు
భూమి తల్లి అన్ని యిచ్చిన, అందినోళ్లే పెద్ద లౌదురు.
ఆనందనోళ్ల బడుగు వర్గం బక్కచిక్కగ దిక్కుయెవరు.

ఓటరన్నా ! నోటులడగకు, తూలిసోలెడి దారు లెంచకు,
ఉన్నచోటనె నిలిచి నువ్వు, దూరమాలోచించు కొనుము,
ప్రలోభాలకు లొంగిపోవకు, నీ కుటుంబాగు జూచెడి
నేత యెవ్వరో నిర్ణయించుము, జాతి ఆశలు నువ్వె తీర్చుము
భరత రాజ్యాంగమ్ము నీకు కట్ట బెట్టిన ఓటు నీది
భవ్య భారతి రూపు రేఖలు దిద్దవలసిన ఓటునీది
దివ్య భారతి ఆత్మస్థైర్యం నిలప వలసిన ఓటు నీది
జాతి బ్రతుకుల నవ్య స్వప్నం తీర్చవలసిన ఓటు నీది



\- డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి
సాయిపేట, కడప.

చెరువులో అక్రమ తవ్వకాలు

యథేచ్ఛగా మట్టి తరలింపు.. పట్టని ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - ముద్దనూరు

కొన్ని ప్రదేశాల్లో ఎలాంటి తవ్వకాలు జరపకూడదని ప్రభుత్వం నిషేధిత ఆజ్ఞలు జారీ చేసి ఆయా శాఖల అధికారులకు ఆదేశాలిచ్చింది. ఆయా శాఖల అధికారుల అనుమతి లేకుండా కొండల్లో, చెరువుల్లో, వంకల్లో, గుట్టల్లో మట్టి తవ్వకాలు చేయకూడదు. ఏదైనా తవ్వకాలు జరపాలంటే తప్పనిసరిగా ఆయా శాఖల ద్వారా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేనిదే ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదు. అయితే ఇందుకు భిన్నంగా ముద్దనూరులోని పెద్ద చెరువులో కొందరు అక్రమమార్కులు నీటి పారుదల (మైనర్ ఇరిగేషన్)శాఖ అధికారుల అనుమతి లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ముద్దనూరు నుండి జమ్మలమడుగు వెళ్లే రహదారిలో ఉన్న పెద్ద చెరువులో జెసిబితో ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపారు. మూడురోజుల క్రితం ట్రాక్టర్లతో భారీగా మట్టిని తరలించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎన్నికల వేళ కావడంతో వివిధ శాఖల అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. అడిగే వారు లేరని.. ఇదే అదునుగా కొందరు దొరికిన కాడికి దోచుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అనుమతి లేకుండా చెరువులో తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరగా.. చెరువులకు సంబంధించి చిన్న నీటి పారుదల శాఖ అధికారులదే బాధ్యత అన్నారు.



చెరువులో చేపడుతున్న మట్టి తవ్వకాలు

అనుమతి కోరుతూ దరఖాస్తులు రాలేదు

చెరువులో మట్టి తవ్వకాల అనుమతి కోసం ఎలాంటి దరఖాస్తులు రాలేదు. మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతి మంజూరు చేయలేదు. అనుమతి లేకుండా చెరువులో తవ్వకాలు చేపట్టకూడదు. పరిశీలించి తవ్వకాలు జరిపి మట్టి తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉన్నా.

- చంద్రమోహన్‌రెడ్డి, ఎఇ, చిన్న నీటి పారుదల శాఖ, ముద్దనూరు



పార్టీలో చేరిన వారితో వైసిపి నాయకులు

టిడిపి నుంచి వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని రోటరీ పురంలో ఉన్న 15 కుటుంబాలు ఆదివారం రోటరీపురం సాకే నరేష్, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురు ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి నుంచి రహీం కుటుంబ సభ్యులు, అన్వర్, మస్తాన్, బాబాజీ, కిషోర్, రహమతుల్లా, శీను, శ్రీధర్, బాబా వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీల్లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీ నాయకులు వైసిపి వైపు మొగ్గు చూపు తున్నారన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డిని, ఎంపీ అవినాష్‌రెడ్డిని భారీ మెజా ర్టీతో గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడి రమణ, కోమెర హరినాథ్, బాబయ్య, వలి, పద్మనాభరెడ్డి, రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిసిఆర్ఆర్ఎమ్ ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ముద్దనూరు

2024-25 విద్యా సంవత్సరానికిగానూ జిసి రంగారెడ్డి మెమోరియల్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఐటిఐలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్లు ఉన్నాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మహిళా అభ్యర్థులకు ప్రతి ట్రేడులో 33 శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు ఉచిత హాస్టల్, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. ఐటిఐ చేసిన వారు రెగ్యులర్ డిగ్రీ చేరుటకు అవకాశం ఉందన్నారు. ఆర్ఆర్‌బి, కాంపిటీషన్ పరీక్షలకు అనుభవజ్ఞులచే ప్రత్యేకశిక్షణ ఇస్తామన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సుబ్బారావు చెప్పారు. విద్యార్థులు జూన్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

కనీస అవసరాలకు నోచని పేదల కాలనీ

ప్రజాశక్తి - చాపాడు



మౌలిక వసతుల్లేని సుందరయ్య కాలనీ

మైదుకూరు మున్సిపాటిలీ పరిధిలోని నానుబాలపల్లెకు వెళ్లే మార్గంలో బిసి, ఎస్‌టి వసతిగృహాల ఎదురుగా నూతనంగా ఏర్పడిన సుందరయ్య పేదల కాలనీలో కనీస అవసరాలు కూడా లేవు. వారికి మౌలిక వసతులు తీర్చలేని పరిస్థితిలో ప్రభుత్వాలు కొనసాగుతున్నాయి. కనీస అవసరాలకు నోచుకోని 70 కుటుంబాలు ఉన్నాయి. మైదు కూరులోని వివిధ ప్రాంతాలలో ఉన్న నిరుపేద కుటుంబాలు సిపిఎం అండతో గుడిసెలు, చిన్నపాటి రేకుల షెడ్డు వేసుకుని ఉంటున్నారు. కాలనీ ఏర్పడి మూడు సంవత్సరాలు కావ స్తున్నా తాగునీటి ఏర్పాట్లు లేని పరిస్థితి. విద్యుత్ సదుపాయం, రోడ్లు, డ్రయినేజీ గురించి చెప్పనక్కర్లేదు. 70 కుటుంబాల వారు ప్రతి రోజు కూలీ పనులు, చిన్నచిన్న రోజువారి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలోకానీ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వీరి గురించి పట్టించుకునే నాథుడు లేడు. సిపిఎం జిల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో కొన్ని కనీస అవ సరాలను తీర్చుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అనేకమార్లు వీరి సమస్యలను పరిష్కరించాలని ర్యాలీలు, నిరసనలు వ్యక్తం చేసినా పట్టించుకునే నాథుడు లేడు. తమను చిన్నచూపు చూడకుండా వీలైనంత త్వరగా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసి కాలనీని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం దివాలా : టిడిపి



మాట్లాడుతున్న మహమ్మద్ షబ్బీర్, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని రైతు విభాగం టిడిపి జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి విమర్శించారు. ఆదివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. భారతదేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని పేర్కొన్నారు. స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాల కాలంలో ఎందరో ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పరిపాలన చేశారని, ఏ ఒక్క ముఖ్యమంత్రి పట్టాదారు పాసుపుస్తకాలపై వారి ఫొటోలను ముద్రించుకోలేదని తెలిపారు. వచ్చిన 5 సంవత్సరాల కాలంలోనే సిఎం జగన్ పట్టాదారు పాసుపుస్తకాలపై తన ఫొటోలను ముద్రించుకోవడం దుర్మార్గమన్నారు. పట్టాదారు పుస్తకాలపై సిఎం జగన్ ఫొటో ముద్రించుకోవడంతో ఆ పార్టీకి చెందిన వారే విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. ఇతరుల ఆస్తులపై సిఎం ఫొటో పెట్టడం ఏంటని వారు ప్రశ్నించారు. వైసిపి పాలనలో పాపాఘ్ని నది నుంచి వేంపల్లె ప్రాంత ప్రజలకు తాగునీరు అందించక పోవడం సిగ్గుచేటన్నారు. రూ.100 కోట్లతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు అరకొరగా చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై గుంతలు తీయడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 శాతం పనులు చేసి 80 శాతం పనులు వదిలి వేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయన్నారు. అభివృద్ధి పనులు చేపట్టినట్లు గొప్పలు చెప్పే వైసిపి ప్రజాప్రతినిధులకు ప్రజల సమస్యలు కనపడలేదా అన్నారు. ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో చంద్ర, ఎద్దుల శేషారెడ్డి, సుధాకర్ రెడ్డి, గోటూరు నాగభూషణం, మడక శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, సయ్యద్ పీరా ఫయాజ్, మాజీ ఆర్మీ అధికారి అనిల్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపికే మా మద్దతు : కౌన్సిలర్ శివజ్యోతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మా మద్దతు వైసిపికేనని జిల్లా కార్మిక నాయకుడు కుతుబుద్దీన్, 33వ వార్డు కౌన్సిలర్ శివజ్యోతి (టిడిపి) తెలిపారు. ఆ మేరకు వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 10 నెలల క్రితం టిడిపి నుండి సస్పెండ్ అయి ఒక నెల క్రితం సస్పెన్షన్‌ను ఎత్తివేశారని, సస్పెండ్ చేసిన కారణమేమిటని అడిగినప్పటికీ సమాధానం లేదన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థిని ప్రకటించిన అనంతరం తమ సస్పెన్సన్‌ను ఎత్తివేశారని తెలిపారు. ఇదంత తమకు అవమానంగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. బిసిల పార్టీ అని చెప్పుకునే టిడిపి చెప్పేదొకటి చేసేదొకటి అన్నారు. టిడిపి పక్షాన మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచిన బిసికు చెందిన ఓ మహిళ ఆవేదనను కూడా పట్టించుకోలేదన్నారు. బిజెపి తెచ్చిన నల్లచట్టం ఎన్ఆర్‌సి సమయంలో షాహిన్‌బాగ్ తరహాలో తాము ఉద్యమం చేస్తున్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు తమ ఉద్యమానికి మద్దతు ప్రకటించారన్నారు. జగన్ నాయకత్వంలోనే బిసిలు, కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. తమ మద్దతుదారులతో చర్చించి అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సమావేశంలో కార్మిక నాయకులు దస్తగిరి, దాదాపీర్, శేఖర్, ఖాజా, లక్ష్మినారాయణ, నరసింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుతుబుద్దీన్, కౌన్సిలర్ శివజ్యోతి

'దాచిన డబ్బు ఎక్కడో జగన్ చెప్పాలి'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో అరాచక, నిరంకుశ జగన్ పాలనకు ఓటర్లు ఓటుతో స్వస్తి పలకాలని తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి చలిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్‌డిఎ కూటమిపై ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సంక్షేమం పేరుతో లక్షల కోట్లు అప్పు చేసి కేవలం రెండు మూడు లక్షల కోట్లను మాత్రమే ప్రజలకు అందించి మిగతా డబ్బును ఎక్కడ దాచి పెట్టారో జగన్ చెప్పాలన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం నాట్యాచార్యులు ఎస్.విజయశాంతి అవార్డు గ్రహీత ముద్ర డ్యాన్స్ స్కూల్, కడప వారి చిన్నారుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. కార్యక్రమంలో నాట్యాచార్యులు ఎస్. విజయశాంతి, పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

జలకళను కోల్పోయిన చెరువులు

బీళ్లుగా మారబోతున్న బ్రహ్మసాగర్ ఆయకట్టు పొలాలు - మూగ జీవాలకూ తప్పని తిప్పలు


2.43 టిఎంసి నీటితో బ్రహ్మసాగర్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

వర్షాభావంతో బ్రహ్మంగారి మఠం మండలంలోని చెరువులు జలకళను కోల్పోయాయి. చుక్క నీరు లేక మైదానాల్లా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. బ్రహ్మసాగర్‌కు కూతవేటు దూరంలో ఉన్న చెరువుల్లో నీరులేక వెలవెలబోతున్నాయి. రాబోవు రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి శ్రీశైలం జలాశయం నుండి బ్రహ్మసాగర్‌కు నీళ్ల వదిలితేనే చెరువులకు పూర్తి స్థాయిలో నీరు చేరేది. బ్రహ్మసాగర్ నీటి సామర్థ్యం 17.8టిఎంసి, ప్రస్తుతం 2.43టిఎంసి నీళ్ల మాత్రమే ఉన్నాయి. బ్రహ్మసాగర్‌లో కానీ, గత సంవత్సరం సరైన వర్షాలు లేవు. అప్పుడప్పుడు బ్రహ్మసాగర్ నుండి చెరువుల్లో చేరిన కాసిన్ని నీళ్ల చేపలు పట్టుకోవడం కోసం బయటకు వదిలేయడంతో చెరువులు వట్టిపోయాయి. ఈ నేపథ్యంలో ఆయకట్టు, చెరువులలో నీళ్ల ఖాళీ అయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. తాగునీరు లేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. మండలంలో బ్రహ్మసాగర్ ఆయకట్టు కింద 26 చెరువులు ఉన్నాయి. సోమిరెడ్డిపల్లి, చౌదరివారి పల్లి, నెలటూరు, మలుగుడుపాడు, గుండాపురం, పలుగురాళ్ల పల్లి, ముడమాల, వెంకటాపురం తదితర గ్రామాల్లో చెరువులున్నాయి. వీటి పరిధిలో వందల ఎకరాల ఆయకట్టు ఉంది. వెలుగోడు ఎత్తిపోతల పథకం కోసం బ్రహ్మసాగర్ ఆయకట్టు కింద ఉన్న రైతాంగం ఎదురు చూస్తోంది. చిన్న చెరువులు, కుంటల్లో నీరు నింపేందుకు ఈ ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే పూర్తి కాలేదు. ఈ పథకం నిర్మాణం పూర్తయితే కాలువల ద్వారా బ్రహ్మసాగర్ కింద ఉన్న చెరువులకు పుష్కలంగా నీరు అందుతుంది. వేసవిలో సాగునీటి అవసరాలు తీరడంతోపాటు, మూగ జీవాలకు తాగునీరు పుష్కలంగా అందుబాటులోకి వచ్చేది. కానీ పథకం ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు.


పూర్తిగా ఎండిపోయిన చెరువు

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది


పోలింగ్ విధులకు హాజరవుత్ను సిబ్బంది

ప్రజాశక్తి - వేంపల్లె

2024 సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేంపల్లె మండల వ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వేంపల్లె పట్టణంలో 36 పోలింగ్ కేంద్రాలున్నాయి. అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే ఇవిఎం మిషన్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరాయి. సమస్యాత్మక ప్రాంతాలైన అలవలపాడు, రామిరెడ్డిపల్లి, కుప్పాలపల్లి గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వేంపల్లె మండల వ్యాప్తంగా 46,031 మంది ఓటర్ల ఉండగా, వాటిలో 22,520 మంది పురుషులు, 23,511 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్ననారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు 6 మంది చొప్పున 390 పోలింగ్ సిబ్బంది విధులకు హజరైనట్లు అధికారులు తెలిపారు.

269 పోలింగ్ కేంద్రాలు, 2,506 మంది సిబ్బంది : ఆర్ఒ

మైదుకూరు : 2024 సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మైదుకూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 269 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ చేసినట్లు రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. 24 కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల అధికారుల ద్వారా పిఒలకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తంగా 2,506 మంది సిబ్బంది పాల్గొంటున్నారని, 29 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లింగాల : సోమవారం జరిగే ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 23,710 ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 11,725, స్త్రీలు 11,990 మంది ఉన్నారు. మండలంలో మొత్తం 19 పంచాయితీగానూ 36 బూత్‌ను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ రాము తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. పోలీస్ బలగాలను కూడా భారీగానే ఏర్పాటు చేశామన్నారు. ఒక ఎస్పీ, సీఐ, ఎఎస్ఐ మూడు రూట్లు, మొబైల్స్ 60 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలైన అంబకపల్లి, కోమనూతల, గుణగనపల్లి, మురారి చింతల, బోనాల గ్రామాల్లో ఇప్పటికే పోలీస్ కవాత్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఆయా గ్రామాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని ఎస్ఐ తెలిపారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికారులు ఓటింగ్‌కు సంబంధించి సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 36 పోలింగ్ కేంద్రాల పరిధిలో


పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు

12,539 మంది పురుషులు, 13,402 మంది మహిళలు, ఒక ట్రాన్స్ జెండర్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు తాగునీరు, లైటింగ్‌తోపాటు పరిసరాల పరిశుభ్రత, బ్యారికెట్లు, ఓటర్ల నీడ కోసం సేమియనా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే బిఎల్ఒలు ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్పులు అందజేశారు.

చాపాడు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది, సామగ్రి పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. శనివారం ఉదయం నుంచి స్థానిక సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిబ్బందికి అవసరమైన సామగ్రిని అందించారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు ఎనిమిది మంది సిబ్బందిని, అందుకు సంబంధించిన సామగ్రిని అందజేశారు. తహశీల్దార్ భూషణం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. మండల పరిధిలో 39 పోలింగ్ కేంద్రాలు ఉండగా, రూట్లగా విభజించి సిబ్బందిని గ్రామాలకు తరలించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఎస్ఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.


సిద్ధారెడ్డిపల్లెకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది


ఖాదర్‌పల్లె పోలింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఎస్‌పి

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - చాపాడు

ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన చాపాడు మండలంలోని నక్కలదిన్నె, ఖాదర్‌పల్లెను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఎవరి ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రలోభాలు, బెదిరింపులు ఎవరైనా చేసినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో మైదుకూరు డిఎస్‌పి టి.వెంకటేశులు, మైదు కూరు రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి, మైదుకూరు ఎస్ఐ కొండారెడ్డి, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ : ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికిలోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అపాకపనేజ ఆదివారం ఆయన ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన కామనూరు, దొరని నిపల్లిను సందర్శించి పరిశీలించారు. కార్యక్ర మంలో ప్రొద్దుటూరు డిఎస్‌పి మురళీధర్, రూరల్ సిఐ రమణారెడ్డి, రూరల్ ఎస్ఐలు శివప్రసాద్, చిరంజీవి, క్విక్ రెస్పాన్స్ టీం ఉన్నారు.

సింహాద్రిపురం : ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటర్లు ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలానికి ఇప్పటికే తమిళనాడు రాష్ట్రానికి చెందిన పోలీసు బలగాలు వచ్చాయన్నారు.

ఎర్రగుంట్ల : ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికిలోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదివారం సమస్యాత్మక గ్రామమైన పెదనపాడు ప్రజలకు సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.

ముద్దనూరు : సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు అన్నారు. మండలంలోని బొందలకుంట, ఆరవేటిపల్లె, దేనేపల్లె, మంగపట్నం గ్రామాల్లో ఆదివారం సిఐ దస్తగిరితో కలిసి ఎఎస్‌పి పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద సంయమనం పాటించి, సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


నెర్రవాడలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

- దోమలు, దుర్వాసనతో ప్రజల అవస్తలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉంది. సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసినప్పటికీ డ్రయినేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు, వ్యర్థపు నీరు రోడ్లపైనే నిల్వ ఉంటూ రోగాలకు నిలయాలుగా మారుతున్నాయి. పంచాయతీ అధికారులు వాటిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక పారిశుధ్య నిధులు మంజూరైనప్పటికీ వాటిని వినియోగించడంలో వెనుకబడుతున్నారు. గ్రామ పంచాయతీలో వేలాది రూపాయలు బ్యాంకు ఖాతాలలో పారిశుధ్య నిధులు మురిగిపోతున్నాయి. రోడ్లపై నిలువ ఉంటున్న మురికి నీరు పాచి పట్టి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడుతుండడంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలుస్తోంది. తద్వారా మురుగునీరు అధికమై దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని స్థానికులు హడలిపోతున్నారు. రాబోయేది వర్షాకాలం కావడంతో అధికారులు స్పందించి లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో పారిశుధ్య పనులను చేపడితే ఉపయోగకరంగా ఉంటుంది. లేదంటే ప్రజలు జ్వరాల బారిన పడి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మండల పరిధిలోని రేపల్లె, రాజువారిపేట, ఖాదర్‌పల్లె, చియ్యపాడు, చిన్నగురువలురు నెర్రవాడ, తదితర గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. నెర్రవాడ గ్రామంలో నీరు అధికంగా నిలుస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. గత వారంలో పడిన వర్షానికి అధికంగా నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, దుర్వాసనను భరించలేకున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వేసవిలో ఆరుబయట పడుకోవాలంటే దోమలతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులు పట్టించుకోవాలని, వెంటనే పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా గ్రామ చావిడి

మరమ్మతులు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలో 1970లో నిర్మించిన గ్రామ రెవెన్యూ కార్యాలయం (గ్రామ చావిడి) నిరుపయోగంగా మారింది. నగర పంచాయతీగా రూపాంతరం చెందిన తర్వాత బి.కొత్తకోట పట్టణం వ్యాపార కేంద్రంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్య వ్యాపార కేంద్రాలు సంత బజారుకు వెళ్లే మార్గం మధ్య ఉన్న ఈ గ్రామచావిడి భవనానికి ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో శిదిలావస్థకు చేరుకుంది. భవనం పక్కనే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఉండడంతోపాటు ముఖ్య జువెలరీ దుకాణాలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులో నుంచి విషసర్పాలు రోడ్డుపై వస్తున్నాయని వ్యాపారస్తులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం విలువైన పాత భవనాలను మరమ్మతులు చేయాలని, లేనియెడల పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించి దుకాణాల ఏర్పాటుకు అనుకూలంగా భవనం నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని ప్రజలు అభిప్రా యపడుతున్నారు. నగర పంచా యతీ అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని నగర పంచాయతీకి ఆదాయం చేకూ ర్చేలా వ్యాపార సముదాయాలను నిర్మించి, నగర పంచాయతీ ఆదాయం పెరిగేలా చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై కమీషనర్ మనోహర్‌ను వివరణ కోరగా నా దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించడం, ప్రజలకు ఉపయోగ పడే విధంగా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ విష యమై రెవెన్యూ అధికారులను సంప్రదిం చామని ఎన్నికల విధులు అవ్వగానే రెవెన్యూ అధికారులు గ్రావ ఎచావిడి భవనాన్ని ఆదీనం చేసిన వెంటనే మర మ్మతులు చేయి స్తామిన లేకు ండా నూతనంగా రూములు నిర్మించి మున్సి పల్ రూము లుగా వినియోగించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు.



శిథిలావస్థలో ఉన్న గ్రామచావిడి



వీల్ చైర్లను అందిస్తున్న వెలుగు సెక్రటరీ

విభిన్న ప్రతిభావంతులకు పది వీల్‌చైర్లు

ప్రజాశక్తి-మదనపల్లి

జిల్లా వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ అధికారి కృష్ణ కిషోర్, వెలుగు సంస్థ సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి సహకారంతో పది వీల్ చైర్లను అమ్మచెరువుమిట్ట వెల్ఫేర్ అధికారి విజయ్‌కుమార్, పి.గణేష్‌లకు అందించారు. ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విభిన్న ప్రతి భావంతులు, వృద్ధులు ఎవరైనా అవసరమైన వారు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు ఈవీల్ చైర్లను వాడుకోవాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

పటిష్ట బందోబస్తు ఏర్పాటు : ఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లెలో 1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి కృష్ణారావు తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లె జడ్‌పి హైస్కూల్లో ఆయన మాట్లాడుతూ గ్రామ, పట్టణ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగంచుకునే విధంగా అన్ని రకాల భద్రత ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఎన్‌సిసి ఎన్‌ఎస్‌ఎస్ పారామిలటరీ, స్ట్రైకింగ్, స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్, హెూంగార్డులు, మాజీ సైనికులు, సిఐలు, ఎస్‌ఐలు, పోలీసులు మొత్తం 1500 మందితో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాలు, మొబైల్ స్టైకింగ్ ఫోర్సు, వీడియో కబరేజీ పోలీస్ మొబైల్ వాహనాలు, మైక్రో అబ్జర్వర్లు వంటి వారితో బందోబస్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసాద్ రెడ్డి, సిఐలు వల్లిబాషా, యువరాజు, ఎన్.శేఖర్ ఉన్నారు.

శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-కడపఅర్బన్

నగరంలోని శిల్పారామంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం మిస్పొ మూవీ ఆధ్వర్యంలో కడప నగరానికి చెందిన అఖిల్ డాన్స్ అకాడమీ బృందం జానపద, శాస్త్రీయ, సినీ గీతాలకు నృత్యాలు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. శిల్పారామం ఎఒ మునిరాజు మదర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.



సాంబశివునికి కార్యక్రమాల్లో చిన్నారులు

ప్రత్యేక హోదా ఇండియా వేదికతోనే సాధ్యం



విలేకరులతో మాట్లాడుతున్న రెడ్డిసాహెబ్

ప్రజాశక్తి-మదనపల్లి

ఎపికి ప్రత్యేకహోదా ఇండియా వేదికతోనే సాధ్యమని మదనపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రెడ్డి భాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అణచివేతకు గురయ్యారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును వినియోగించుకుని రాష్ట్ర అభివృద్ధి దేశ అభివృద్ధి చేసేవారినే పట్టం కట్టాలన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అనుచివేత విధానాలను మతకలోహాలను సృష్టించి ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటీకరణ చేసిన ఘనత బిజెపి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అలాగే రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టుకు సరైన సమయంలో నిధులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారని అన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రాన్ని పూర్తిగా సర్వనాశనం చేసిన బిజెపిని, అసమర్ధ పాలనతో రాష్ట్రాన్ని అవినీతి మయంగా మార్చిన వైసిపి పభుత్వాన్ని తమ ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఇండియా వేదిక అభ్యర్థులు రాజంపేట అభ్యర్థి సిపిఐ అభ్యర్థి విశ్వనాథ్‌నాయక్, మదనపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మల్ల పవన్‌కుమార్‌రెడ్డి, రైల్వేకోడూరు నుంచి గోసాల దేవి, రాయచోటి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అల్లా ప్రకాష్, పుంగనూరు నుంచి మురళీమోహన్ యాదవ్, తంబల్లపల్లి నుంచి ఎంఎన్ చంద్రశేఖర్ రెడ్డి, పీలేరు నుంచి సోమశేఖర్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బషీరాకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసిపిలో 150 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట గ్రామంలోని అరుంధతివాడలో శనివారం వైసిపిని వీడి జనసేన పార్టీలో చేరారు. 24 గంటలు గడవకముందే మళ్లీ తిరిగి జనసేన వీడి వైసిపిలోకి మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ జనసేన నాయకులు భోజనం పెడుతున్నామని రమ్మని తెలియకుండా మాయ మాటలు చెప్పి జనసేన కండువా వేశారని తెలిపారు. అప్పయ్య రాజుపేట అరుంధతివాడ వైసిపి కుటుంబం లాంటిదని తెలిపారు. వైసిపిలో చేరిన వారు మాట్లాడుతూ తాము పార్టీ మారే ఉద్దేశమే లేదని వైసిపిలోనే కొనసాగు తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజ్వాన్, రాయచోటి శివయ్య, భరత్, హనుమాన్, కృష్ణ, పెరియవరం సుబ్రహ్మణ్యం, రమణయ్య, నారాయణ, వెంకటసుబ్బయ్య, నాగరాజు, శివప్రసాద్, సుబ్బరాయుడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన కార్యకర్తలతో సయ్యద్ ముస్తాక్

బయటి వ్యక్తులను అనుమతించొద్దు : సిఐ



లాడ్జిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఆదివారం అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ భక్తవత్సలం, సిబ్బం ది పట్టణంలోని లాడ్జిలలో ముమ్మర తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనిఖీలలో లాడ్జిలలో గల రికార్డులను క్షుణ్ణంగా పరిశీ లించి, బయటి వ్యక్తులకు ఎలాంటి పరిస్థితులలో అనుమ తించ రాదని సూచించారు. ఒకవేళ లాడ్జిలలో అనుమతించాల్సి వస్తే సంబంధిత వ్యక్తి వివరాలు పోలీస్ వారికి తెలిపాలని లాడ్జి నిర్వాహకులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత పోలింగ్ నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున భద్రతను మరింత పటిష్టం చేశామని తెలిపారు. పోలింగ్ సమయంలో బయట ప్రాంతాల వారు ఉండకూడదని అన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుఓవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది జగన్, లోకేష్, రామచంద్రలు పాల్గొన్నారు.



జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

చెరగని సిరాను ఓటర్ల వేళ్ళపై వారి ఇంటి వద్దే మార్కు చేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడా లనే కుట్ర రాష్ట్రంలో జరుగుతుందనే సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలను నమ్మవద్దని అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. చెరగని సిరా ప్రభు త్వం మాత్రమే తయారు చేస్తుందని చెప్పారు. ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని, మరెవరికీ ఇది అందుబాటులో ఉండదని తెలిపారు. ఈ సిరా భారతీయ ఎన్నికల సంఘం వద్ద కాకుండా ఇతరులు ఎవరికైనా అందుబాటులో ఉంటుందనేది తప్పుడు ప్రచా రమేనని అన్నారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఎవరైనా ఇతర సిరా ద్వారా ఓటర్ల వేళ్ళపై మార్కు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుదాఘాతంతో జువెలరీ షాప్ దహనం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని గాంధీబజార్‌లో మూసి ఉంచిన విజయలక్ష్మి జువెలరీ దుకాణంలో ఆదివారం ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక అధికారి ఎం.వెంకటరామిరెడ్డి, వారి సిబ్బంది శ్రీనివాసులు, పురుషోత్తం, రామన్న, మనోజ్ కుమార్‌రెడ్డి, రాము, స్థానిక ప్రజలు మంటలను పూర్తి ఆపివేశారు. అగ్నిప్రమాదంలో ఎసి, ఫర్నిచర్, ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డు పూర్తిగా కాలిపోయాయని నిర్వాహకులు తెలిపారు. భవనం క్రింది వైపు గోడలు పాక్షికంగా దెబ్బ తినడంతో సుమారుగా రెండు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందిని పేర్కొన్నారు.



విద్యుదాఘాతానికి కాలిపోయిన ఎసి